
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

కృష్ణా జిల్లా వార్తలు

మంగళవారం 17 సెప్టెంబరు 2024







మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

వర్షాలు, వరదలు తగ్గి ఇప్పుడిప్పుడే సాధారణ పరిస్థితులు ఏర్పడుతుండగా, ఒక్కసారిగా జిల్లాను జ్వరాలు ముంచెత్తాయి. గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారడంతో జ్వరపీడితుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ఫలితంగా మండలాల్లోని పీహెచ్‌సీలు సహా మచిలీపట్నం సర్వజన ఆసుపత్రి కిటకిటలాడుతోంది. డెంగీ పేరుచెప్పి ప్రైవేట్ ఆసుపత్రుల్లో రూ.వేలకు వేలు గుంజుతున్నారు.

విషజ్వరాలతో విలవిల

జిల్లాలో పెరుగుతున్న అనారోగ్య పీడితులు

వర్షాలు, వరదలకు గ్రామాల్లో క్షీణించిన పారిశుధ్యం

- పీహెచ్‌సీలకు క్యూ కడుతున్న బాధితులు
- మచిలీపట్నం సర్వజన ఆసుపత్రి కిటకిట
- భారీగా పడిపోతున్న ప్లేట్‌లెట్లు
- క్యాష్ చేసుకుంటున్న ప్రైవేట్ ఆసుపత్రులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : భారీ వర్షాలు, వరదలు జిల్లాను ముంచెత్తాయి. ఎగువ నుంచి నీరు గ్రామాల్లోకి చొచ్చుకురావడంతో పారిశుధ్యం క్షీణించింది. పంచాయతీల్లోని వీధుల్లో నామమాత్రంగా బ్లీచింగ్, సున్నం చల్లి మమ.. అనిపిస్తున్నారు. పారిశుధ్య చర్యలు అంతంతమాత్రంగా చేస్తుండటంతో జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. జ్వరం బారినపడి ఆసుపత్రికి వెళ్తే.. రూ.వేలల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది. రెండు, మూడు రోజులకు కూడా జ్వరం తగ్గకపోవడంతో డెంగీ ఏమోనని భయపడిపోతున్నారు. మండలాల పరిధిలోని ప్రభుత్వాసుపత్రుల్లో నామమాత్రపు చికిత్స కూడా లభించడంలేదు. దీంతో బాధితులు ప్రైవేట్ ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. అలా వెళ్లిన వారికి ప్లేట్‌లెట్లు తగ్గాయని చెబుతూ రూ.వేలల్లో గుంజుతున్నారు.

గ్రామాల్లో విజృంభణ

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ లెక్కల ప్రకారం ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు 13వ తేదీ వరకు జిల్లాలో 6 వేల మందికిపైగా జ్వరం బారిన పడినట్లు వైద్యశాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు 8,359 మందికి టైఫాయిడ్ పరీక్షలు చేయగా, 1,810 మందికి పాజిటివ్ రిపోర్టులు వచ్చినట్లు వైద్యశాఖ అధికారులు లెక్కలు తేల్చారు. ఇవి జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో నమోదైన లెక్కలే. ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేరి టైఫాయిడ్‌కు చికిత్స చేయించుకున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటోంది. జ్వరం బారినపడిన అనుమానితుల నుంచి రక్తనమూనాలు సేకరించి మలేరియా టెస్టులు చేయగా, జిల్లాలో కేవలం ముగ్గురికి మాత్రమే మలేరియా సోకినట్లు నిర్ధారించారు. కోడూరు, బంటుమిల్లి, పెడన, మచిలీపట్నం, గుడివాడ, ఉంగుటూరు, పెనమలూరు తదితర మండలాల్లో ఇటీవల కాలంలో జ్వరపీడితుల సంఖ్య అధికమైంది. జ్వరం బారిన పడినవారు కనీసం ఐదు రోజుల పాటు ఆసుపత్రిలోనే ఉండి చికిత్స పొందాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

సహనానికి 'పరీక్ష'

జిల్లాలోని 25 మండలాల్లోని పీహెచ్‌సీలకు, సమీకృత ఆసుపత్రులకు డెంగీ లక్షణాలున్న వారు వస్తే ర్యాపిడ్ టెస్టులు చేసేందుకు కిట్లు ఇచ్చారు. ఈ కిట్ల ద్వారా పరీక్షలు చేసి, డెంగీ కేసులుగా గుర్తించినా మళ్లీ మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలో ఎలీసా టెస్టులు చేయాలని, అక్కడ చేసిన పరీక్షలో డెంగీగా నిర్ధారణ కావాల్సి ఉందనే నిబంధనలు పెట్టారు. భారీ వర్షాలు, వరదల కారణంగా ఇటీవల కాలంలో మండలాల్లో ఉన్న ఒక్కో పీహెచ్‌సీకి కనీసం రోజుకు 20 నుంచి 30 మంది జ్వరం బారినపడినవారు వస్తున్నారు. ఎవరికి డెంగీ టెస్టులు చేయాలో తెలియక వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. తీవ్రజ్వరం సోకిన వారిని మచిలీపట్నంలోని సర్వజన ఆసుపత్రికి పంపేసి చేతులు దులుపుకొంటున్నారు. దీంతో తీవ్రజ్వరం బారినపడిన బాధితులు భయంతో మచిలీపట్నం, విజయవాడలోని ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్తున్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో డెంగీ పరీక్ష చేసేందుకు ప్రైవేట్ ల్యాబ్ యజమానులు రూ.2 వేల వరకు వసూలు చేస్తుండటం గమనార్హం. పమిడిముక్కల, పెనమలూరు, కోడూరు, గన్నవరం, బంటుమిల్లి, పెడన, ఉయ్యూరు, మచిలీపట్నం, చల్లపల్లి తదితర మండలాల్లో డెంగీ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌తో పాటు గుడివాడ పురపాలక సంఘంలోనూ డెంగీ కేసులు నమోదవుతున్నాయి. బంటుమిల్లి పంచాయతీ, కోడూరు తదితర ప్రాంతాల్లో ఇటీవల కాలంలో డెంగీ కేసులు అధికంగా నమోదవుతుండగా, వారంతా దగ్గరలోని మచిలీపట్నానికి వచ్చి ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేరి చికిత్స చేయించుకుంటున్నారు.

59 డెంగీ కేసులు

ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు జిల్లాలో 59 డెంగీ కేసులు నమోదయ్యాయి. జనవరిలో 2, ఫిబ్రవరిలో 4, మార్చిలో 7, ఏప్రిల్‌లో 4, మేలో 8, జూన్‌లో 5, జూలైలో 7, ఆగస్టులో 10 కేసులు నమోదయ్యాయి. సెప్టెంబరులో 12 డెంగీ కేసులు నమోదయ్యాయి. ఈ నెలలోనే డెంగీ కేసులు అధికంగా నమోదు కావడం గమనార్హం. రెండు, మూడు నెలల వ్యవధిలో వందలమంది డెంగీ బారినపడి మచిలీపట్నం, విజయవాడ తదితర ప్రాంతాల్లోని ఆసుపత్రుల్లో చికిత్స పొందారు. ఇలాంటి వారికి ప్లేట్‌లెట్లు ఎక్కించేందుకు, వైద్యచికిత్స కోసం వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఖర్చుకు వెనుకాడకుండా విజయవాడలోని ల్యాబ్‌ల నుంచి ప్లేట్‌లెట్లను తెచ్చుకుంటున్నారు.

అక్టోబరులో నూతన మద్యం పాలసీ

- వరద బాధితులకు అన్ని సహాయ చర్యలు
- ప్రజా దర్బార్‌లో సమస్యలకు పరిష్కారం : మంత్రి కొల్లు రవీంద్ర

6లో..



పవిత్ర సంగమం వద్ద నవహారతులు (ఫైల్) ఇన్‌సెట్‌లో.. దుర్గాఘాట్ వద్ద ఏర్పాట్లు

శరన్నవరాత్రికే నవహారతి

దసరా నుంచి దుర్గాఘాట్‌లో కృష్ణానదికి నవహారతులు

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కృష్ణమ్మకు నవహారతుల కార్యక్రమానికి దుర్గాఘాట్ వేదిక కానుంది. ఇకపై ఇక్కడి నుంచే నవహారతులు ఇవ్వాలని దేవదాయ శాఖ, దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ అధికారులు నిర్ణయించారు. అక్టోబరు మూడు నుంచి ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం కానుండగా, ఆరోజు నుంచే నవహారతుల కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు.

- పవిత్ర సంగమం నుంచి మార్పు చేసిన ప్రభుత్వం
- దేవదాయ, దుర్గగుడి అధికారులతో సమావేశం అనంతరం నిర్ణయం
- నది ఉత్తరంవైపు నుంచి దక్షిణ వైపునకు ప్రవహించడం వల్లే..

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇబ్రహీంపట్నంలోని పవిత్ర సంగమం వద్ద పంటుపై ఈ హారతులిచ్చేవారు. ఆలయానికి చెందిన పురోహితులు నిత్యం అక్కడికి వెళ్లేవారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక నవహారతులకు మంగళం పాడేసింది. వాటి గురించి పట్టించుకోవడం మానేసింది. దీంతో దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ అధికారులు అక్కడి నుంచి హారతుల సామాగ్రిని తీసుకొచ్చేశారు. దుర్గాఘాట్ వద్ద, ఇరిగేషన్ శాఖ మోడల్ గెస్ట్‌హౌస్ పక్కనే ఉన్న రేకుల షెడ్ వద్ద నిర్మించిన గట్టుపై నుంచి నదికి పంచహారతులు ఇస్తున్నారు. ప్రస్తుతం నదికి ఈ పంచహారతుల ప్రక్రియ నడుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పవిత్ర సంగమానికి పాతకళను తీసుకురావాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా అక్కడ నవహారతులు ఇవ్వాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. జలవనరుల శాఖ, దేవదాయ శాఖ, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయం చేసుకుని ఈ హారతులను ప్రారంభించాలని స్పష్టం చేశారు. దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈ ప్రదేశాన్ని పరిశీలించి త్వరలోనే నవహారతులను ప్రారంభిస్తామని వెల్లడించారు.

సీఎం భేటీ అనంతరం మారిన నిర్ణయం

కృష్ణానదికి ఇచ్చే నవహారతులకు సంబంధించి కొద్దిరోజుల క్రితం సీఎం చంద్రబాబు దేవదాయ శాఖ, దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ అధికారులతో సమావేశమయ్యారు. ఇందులో హారతుల గురించి స్పష్టంగా వివరాలు తెలుసుకున్నారు. హారతులను నదికి ఇస్తారా, భక్తులకు ఇస్తారా అని ప్రశ్నించారు. సమావేశంలో పాల్గొన్న ప్రముఖ అర్చకులు నదికే ఇస్తారని చెప్పారు. కాశీలో నది వైపునకు తిరిగి గంగకు హారతులు ఇస్తారు. దీన్ని తిలకించడానికి భక్తులు కొంతమంది ఘాట్లపై ఉంటారు. మరికొంతమంది బోట్లలో నదిలోకి వెళ్తారు. నది వైపునకు తిరిగి హారతులు ఇస్తే భక్తులకు కనిపించదు. దీంతో భక్తులు తిలకించడానికి వీలుగా హారతులు ఉండేలా ఇవ్వాలని చంద్రబాబు ఆదేశించారు. నది ఉత్తరం వైపు నుంచి దక్షిణ వైపునకు ప్రవహిస్తోంది. ఎగువ నుంచి వచ్చే నదికి హారతులు ఇవ్వడం దేశంలో ఎక్కడా లేదని, ఇలా ప్రవహించే నదికి హారతులు ఇవ్వడం చాలా ఉత్తమమని అర్చకులు సీఎంకు వివరించారు. ప్రస్తుతం పంచహారతులు ఇస్తున్న ప్రదేశం నుంచి ఉత్తరం వైపు నుంచి ప్రవహించే నదికి హారతులు ఇస్తారు. దుర్గాఘాట్‌లో మెట్లపై భక్తులు కూర్చుని ఈ హారతులను వీక్షించడానికి వీలుంటుంది. ఈవిధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఐదుగురు పురోహితులు పంచహారతులను ఇస్తున్నారు. నవహారతులు ప్రారంభిస్తే మరో నలుగురు పెరుగుతారు. ఇందుకు అనుగుణంగా తొమ్మిది మంది పురోహితులు నిలబడేందుకు తొమ్మిది చెక్క బల్లలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఐదు బల్లలు ఉన్నందున కొత్తగా మరో నాలుగు చేయించారు. దీపపు కుందులు సమకూరుస్తున్నారు.

నవహారతులు ఇవీ..

ఓంకారం, నాగ, పంచ, సింహ, సూర్య, చంద్ర, నంది, కుంభ, నక్షత్ర హారతులు ఇస్తారు.



వరద మిగిల్చిన బురద



గుట్టలుగా ముం'చెత్త'గా..



మురికివాడ

- బెజవాడలో వరద ప్రాంతాలను వీడని మురుగు
- ఇంటి లోపల, వీధుల్లోకి చేరిన మురుగునీరు
- భరించలేని దుర్వాసనతో బాధితుల అవస్థలు
- రెండు వారాలవుతున్నా ఇంకా కన్నీరుమున్నీరు

పెను ఉప్పెనలా వచ్చిన వరద బెజవాడను మురికివాడగా మార్చేసింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో పేరుకుపోయిన మురుగు బాధితులకు చుక్కలు చూపిస్తోంది. ఇంటి లోపల, బయట, పరిసర ప్రాంతాల్లో ముందుకు కదలక అష్టకష్టాలు పెడుతోంది. నల్లగా మారిపోయిన వీధుల్లో నడవడమే కష్టం కాగా, ఇళ్లను ఎంత శుభ్రం చేసినా భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. అయినా చాలా ప్రాంతాల్లో బాధితులు అలాగే కాలం గడుపుతున్నారు. వరద వచ్చి రెండు వారాలవుతున్నా ఇంకెన్నాళ్లు తమకీ కష్టాలంటూ కన్నీరు పెట్టుకుంటున్నారు.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి



ఆరని వస్తువులు.. తీరని వెతలు : వరద బాధిత ప్రాంతాల్లో పుస్తకాలు, దుస్తులు, బ్యాగులు ఆరబెట్టుకుంటూ.., సామాన్లు శుభ్రం చేసుకునే పనిలో మహిళలు

దసరా ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన

కాలినడకన ఇంద్రకీలాద్రిని పరిశీలించిన అధికారులు

- క్యూ మార్గాలు, ఎమర్జెన్సీ గేట్ల పనులకు సూచనలు
- పోలీస్ బందోబస్తుపై క్షేత్రస్థాయి సమీక్ష
- పర్యటనలో పాల్గొన్న సీపీ, దుర్గగుడి ఈవో



6లో

గంగ ఒడికి గణేశుడు

పది రోజుల పాటు పూజలు అందుకున్న గణేశుడు చివరికి గంగ ఒడికి చేరుకున్నాడు. సోమవారం మంగినపూడి బీచ్‌కు దాదాపు వంద విగ్రహాలు క్యూ కట్టాయి. పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.



భక్తితో మిలాద్ ఉన్ నబీ



మచిలీపట్నంలో ర్యాలీలో మంత్రి కొల్లు రవీంద్ర

మిలాద్ ఉన్ నబీ వేడుకలు సోమవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరిగాయి. మచిలీపట్నంలో ముస్లింలు నిర్వహించిన భారీ ర్యాలీలో మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు పాల్గొన్నారు. గుడివాడలోని బంటుమిల్లి రోడ్డులో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొన్నారు.



గుడివాడలో ర్యాలీ

న్యూస్ బాక్స్



శాంతినగర్-కవులూరు గ్రామాల మధ్య గండ్లకు మరమ్మతులు

గండ్లకు మరమ్మతులు

జి.కొండూరు : శాంతినగర్-కవులూరు గ్రామాల మధ్య రహదారిపై గండ్ల మరమ్మతు పనుల్ని సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు అధికారులు పనులు ప్రారంభించారు. మరమ్మతు పనులు పూర్తయితే దెబ్బతిన్న మంచినీటి పైపులైన్ పనులు కూడా పునరుద్ధరించే అవకాశం ఉంది.



మాట్లాడుతున్న కోగంటి రవికుమార్

డీసీ విజయరాజును సస్పెండ్ చేయాలి

గొల్లపూడి, సెప్టెంబరు 16 : దేవదాయశాఖలో అవినీతి రారాజు విజయరాజును సస్పెండ్ చేసి విచారణ చేయాలని ఏపీ ఎండోమెంట్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి కోగంటి రవికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం గొల్లపూడిలోని దేవదాయశాఖ కార్యాలయం వద్ద విలేకర్లతో మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు ఆశయాలకు తూట్లు పొడుస్తూ భక్తులు ఇచ్చిన సొమ్మును దేవదాయశాఖలోని కాకినాడ డీసీ విజయరాజు వంటి కొంత మంది వ్యక్తులు దోచుకుంటున్నారని ఆరోపించారు. ఇలాంటి చర్యలతో దాతల హృదయాలు శోకిస్తున్నాయన్నారు. గత ఆరేళ్ల క్రితం విజయరాజుపై ఏసీబీ అధికారులు దాడులు చేసి వందల కోట్ల ఆస్తులు, పట్టు చీరెలు, బంగారం, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారన్నారు. కోర్టు ఆర్డర్ ఉన్నా నాటి మంత్రి వెలంపల్లి అండతో ఆర్థిక సంబంధమైన డీసీ పోస్టు వేయించుకున్నాడన్నారు. అన్ని ఆధారాలతో విజయరాజుపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు చేసినట్టు తెలిపారు. ఆరేళ్లుగా ఏసీబీ విజయరాజుపై చార్జిషీటు దాఖలు చేయలేదని, తక్షణం అతడిని సస్పెండ్ చేసి చార్జిషీటు వేయాలని డిమాండ్ చేశారు.

క్రైం కార్నర్

రూ.140 ఇవ్వలేదని కుటుంబంపై దాడి

గుడివాడ రూరల్ : గుడివాడ రూరల్ మండలం పర్నాస గ్రామానికి చెందిన గంటా తంబి రూ.140 డబ్బులు ఇవ్వలేదని గ్రామానికి చెందిన కొందరు సోమవారం దాడి చేశారు. గంటా తంబి కుటుంబసభ్యులతో కలిసి పర్నాస గ్రామంలో నివాసం ఉంటూ చికెన్ షాపు నడుపుకుంటున్నాడు. రెండు సంవత్సరాల క్రితం నుంచి తంబికి, అదే గ్రామానికి చెందిన కొలుసు నాగభూషణం చికెన్ తాలూకు డబ్బులు రూ.140 ఇవ్వకుండా ఉన్నందున ఈనెల 8న సదరు డబ్బు అడగ్గా ఇద్దరికీ మాటమాటా పెరిగి తోపులాట జరిగింది. 15వ తేదీ ఉదయం నాగభూషణం, కుమారులు, బంధువులు కలిసి తంబి ఇంట్లోకి దౌర్జన్యంగా చొరబడి, తంబి, భార్య, పిల్లలపై దౌర్జన్యం చేసి కొట్టి, కులంపేరుతో దూషించారని, చంపేస్తామని బెదిరించారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొలుసు బాలకృష్ణ, కొన్నిపోటి నాగ వెంకటేశ్వరరావు, కొలుసు నాగభూషణం, కొన్నిపోటి మహేష్, వెలగల దీపక్, నిఖిల్, లక్కీ, నవీన్, అభిషేక్, కొలుసు ప్రసాద్, నెల్లపు తేజ, సాహు, తలపోతు కాశీ విశ్వనాథ్‌లపై కేసు నమోదు చేశారు.

భర్త, అత్త, ఆడపడుచులపై కేసు

గుడివాడరూరల్:గుడివాడ మల్లాయిపాలెం పంచాయతీ లక్ష్మీనగర్‌కి చెందిన అబ్దుల్ రషీద్ కుమార్తె అబ్దుల్ ఖాదరునిసకి మచిలీపట్నం ఇంగ్లీష్ పాలెంకి చెందిన మహమ్మద్ ఫరీద్‌తో 2022వ సంవత్సరంలో పెద్ద సమక్షంలో వివాహం చేశారు. భర్త, అత్త, ఆడపడుచులు అదనపు కట్నం తెమ్మని మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నట్టు ఖాదరున్నిసా ఫిర్యాదు చేయటంతో ఎస్ఐ చంటిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోపీకృష్ణ మృతదేహం లభ్యం



జగ్గయ్యపేట రూరల్ : ముక్త్యాల వద్ద కృష్ణానదిలో ఆదివారం సాయంత్రం స్నానానికి దిగి గల్లంతైన వ్యక్తి మృతదేహాన్ని సోమవారం గజ ఈతగాళ్లు వెలికితీశారు. ముక్త్యాల గ్రామ శివారులోని తెలంగాణా రాష్ట్రం సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం దొండపాడు గ్రామానికి చెందిన యలగాల గోపీకృష్ణ (25), స్నేహితుడు గుండెబోయిన గోపీ, మరికొందరితో కలిసి కృష్ణానది ఘాట్ వద్ద స్నానానికి దిగారు. ఈత రాకపోవటంతో వరద ఉధృతికి గోపీకృష్ణ గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీస్, రెవెన్యూ, పంచాయతీ అధికారులు గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టారు. సోమవారం ఉదయం మృతదేహం లభించటంతో పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

దసరా ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన



దసరా ఉత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ రాజశేఖర్ బాబు, ఈవో రామారావు, అధికారులు

వన్‌టౌన్ : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో వచ్చేనెల 3వ తేదీ నుంచి 12వ తేదీవరకు నిర్వహించనున్న దసరా మహోత్సవాలకు సంబంధించి ఏర్పాట్లను ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు సోమవారం ఆలయ ఈవో కేఎస్ రామారావు, ఇంజనీరింగ్, పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి పరిశీలించారు. కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడి నుంచి ఏర్పాటు చేస్తున్న క్యూలైన్లను పరిశీలించారు. భక్తుల ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, ఎమర్జన్సీ గేట్లు, తదితరాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండటంతో వారికి అనుగుణంగా అమ్మవారి దర్శనానికి ఎటువంటి అంతరాయం లేకుండా క్యూలలో సజావుగా వెళ్లేందుకు ఏర్పాట్లు ఉండాలని ఆయన సూచించారు. సీతమ్మవారి పాదాల వద్ద ఏర్పాటు చేస్తున్న కేశఖండనశాలకు సంబంధించి మౌలిక సదుపాయాలు, తదితరాల గురించి చర్చించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. స్నాన ఘాట్లు, జల్లు స్నానాలు, టిక్కెట్ కౌంటర్లు, చెప్పుల స్టాండ్లు, లగేజీ కౌంటర్లు, ప్రసాదం కౌంటర్లు, తదితరాల విషయంలో పలు సూచనలు చేశారు. భక్తులు వేచి ఉండేందుకు ఏర్పాటు చేసిన స్థలాలు, పార్కింగ్ స్థలాలు, తదితరాల పై కూడా దేవస్థానం అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రసాదం కౌంటర్ల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఇటీవల కొండచరియలు విరిగి పడిన ప్రాంతంలో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. ఘాట్ రోడ్డులో పరిస్థితులను అధ్యయనం చేసి తగు సూచనలు చేశారు. భక్తులకు అన్న వితరణ



సిద్ధమవుతున్న భక్తుల క్యూ లైన్లు

ఏర్పాట్లతో పాటు ఏపీ పాయింట్ల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించాలన్న దానిపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భక్తులు ఒత్తిడికి గురికాకుండా క్యూలలో సజావుగా నడిచేందుకు వీలుగా ఏర్పాట్లు ఉండాలని ఇంజనీరింగ్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఈఈ లింగం రమాదేవి, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్స్ అసోసియేషన్ అపన్నహస్తం



వరద బాధితులకు కిట్లను పంపిణీ చేస్తున్న ఆర్‌పీ సిసోడియా, సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు

విజయవాడ, సెప్టెంబరు 16 : వరదల ముంపు ప్రాంత ప్రజలను ఆదుకోవటానికి రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ అసోసియేషన్ తరపున రూ.25 లక్షలు సమీకరించారు. దీనికి సంబంధించిన చెక్కును రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సమక్షంలో, ముఖ్యమంత్రి చంద్రబాబు సహాయ నిధికి అందించారు. దీనికి అదనంగా సింగ్‌నగర్‌లో వరద బాధితులకు సోమవారం 2,500 కుటుంబాలకు రూ. 1100 విలువ చేసే దుస్తుల కిట్లను అందజేశారు. పంపిణీ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఏపీ రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పీ సిసోడియా, ఏపీ సబ్ రిజిస్ట్రార్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎ.గోపాల్, ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.వెంకటేశ్వరరావు, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ విజయవాడ డీఐజీ రవీంద్రనాథ్, నెల్లూరు డీఐజీ వి.కిరణ్‌కుమార్, ఎన్టీఆర్ జిల్లా రిజిస్ట్రార్ వీఎస్ఆర్ ప్రసాద్, జిల్లా రిజిస్ట్రార్ కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

రాచరిక వ్యవస్థకు చెల్లు!

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో

పోడియంల తొలగింపు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో మార్పులు ప్రారంభమౌతున్నాయి. రిజిస్ట్రేషన్ల శాఖలో పారదర్శక సేవలు అందించేందుకు ఒక వైపున ఉన్నతాధికారులు విస్పష్ట నిర్ణయాలు తీసుకుంటుండగా మరోవైపు స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించే దిశగానూ శరవేగంగా అడుగులు పడుతున్నాయి. బ్రిటీష్ కాలం నుంచి సబ్ రిజిస్ట్రార్ల కార్యాలయాలో భారీ పోడియాలపై అధికారులు కూర్చుని విధులు నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. ఇవి న్యాయస్థానాలలో న్యాయమూర్తులు కూర్చునే పోడియంలుగా ఉంటాయి.

కాలం మారినా ఇప్పటికీ రిజిస్ట్రేషన్ అధికారులు ఇదే కొనసాగిస్తున్నారు. దీనిని గుర్తించిన ప్రభుత్వం అధికారులు-ప్రజల మధ్య స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించాలని నిర్ణయించింది. దీనికి అడ్డుగా ఉన్న రాచరికపోడియాలను తొలగించాలని నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో పోడియాల తొలగింపు కార్యక్రమం చేపట్టడం జరిగింది. పటమట, గుణదల, గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్ల కార్యాలయాలలో పోడియంల తొలగింపు పనులు యుద్ధ ప్రాతిపదికన జరిగాయి. కార్యాలయంలో ఎత్తుగా ఉండే డయాస్, దాని చుట్టూ ఉండే చెక్క పార్టీషనింగ్, ఎరుపు క్లాత్‌లను పూర్తిగా తొలగించారు. గుణదల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పోడియం తొలగింపు కార్యక్రమంలో ఏకంగా రాష్ట్ర రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పీ సిసోడియా, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ ఐజీ శ్రీధర్ బాబులు స్వయంగా పాల్గొనటం విశేషం. ఈ కార్యక్రమంలో విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ కూడా పాలుపంచుకున్నారు. విజయవాడ నగరంలో ప్రధానమైన మూడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు విజయవాడ రూరల్, ఇబ్రహీంపట్నం, మైలవరం ఇలా గ్రామీణ ప్రాంతాలలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో కూడా పోడియం తొలగింపు పనులు చేపట్టారు. పోడియం తొలగింపు వల్ల స్నేహపూర్వక వాతావరణం నెలకొంది.



గుణదల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పోడియంను తొలగిస్తున్న సిసోడియా, ఎమ్మెల్యే గద్దె



మిలాద్ ఉన్ నబి కార్యక్రమంలో పాల్గొన్న కొనకళ్ల నారాయణ, తదితరులు

శాంతి సామరస్యాలకు దర్పణం మిలాద్ ఉన్ నబి

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 16 : మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం మిలాద్ ఉన్ నబి సందర్భంగా సోమవారం రాత్రి నిర్వహించిన భారీ ర్యాలీ నగరంలో వినూత్న శోభ సంతరించుకుంది. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొని ప్రసంగించారు. శాంతి సామరస్యాలకు మచిలీపట్నం ప్రతీకగా నిలిచిందన్నారు. మహమ్మద్ ప్రవక్త బోధించిన సిద్ధాంతాలను ప్రజల వద్దకు తీసుకుని వెళ్లాలన్నారు. మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ, ఒకే రోజు వినాయక నిమజ్జనం, మిలాద్ ఉన్ నబి పండుగలు హిందూ ముస్లింల సామరస్యత, ఐక్యతకు నిదర్శనంగా నిలిచాయన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ మాట్లాడుతూ, నగరంలో వందలాది సంవత్సరాల నుంచి ఎంతో చరిత్ర కలిగిన దర్గాలు, మసీదులు ఉన్నాయన్నారు. ర్యాలీలో టీడీపీ నాయకులు కొనకళ్ల బుల్లయ్య, మోటమర్రి బాబా ప్రసాద్, చిత్తజల్లు నాగరాము, హసీంబేగ్, ఎండి ఇలియాస్ పాషా, తలారి సోమశేఖర్, పిప్పళ్ల కాంతారావు, గడ్డం రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము, బండి రామకృష్ణ తదితరులు పానీయాలు అందజేశారు.

సీఎం సహాయనిధికి కనకదుర్గా ఫైనాన్స్ విరాళం

వన్‌టౌన్ : వరద బాధితులను ఆదుకునేందుకు సీఎం సహాయనిధికి విజయవాడకు చెందిన కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్ యాజమాన్యం సోమవారం సీఎం చంద్రబాబును కలిసి రూ.5 లక్షలు విరాళం అందజేశారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో సంస్థ ఛైర్మన్ సంధిరెడ్డి లక్ష్మినారాయణ, ఎండీలు జయప్రకాష్ నారాయణ, శ్రీమన్నారాయణ, గాయత్రిలు ఉన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు వారిని అభినందించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు.



చంద్రబాబుకు విరాళం ఇస్తున్న కనకదుర్గా ఫైనాన్స్ యాజమాన్యం

నరెడ్‌కో అమరావతి అధ్యక్షుడిగా గల్లా



గల్లా రామచంద్రరావు



ఎన్.రాంబాబు

గుంటూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నరెడ్‌కో) అమరావతి అధ్యక్షుడిగా శ్రీ భ్రమర టౌన్‌షిప్ అధినేత గల్లా రామచంద్రరావును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం సాయంత్రం విజయవాడలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నరెడ్‌కో జనరల్ బాడీ సమావేశం జరిగింది. సమావేశంలో కొత్త కమిటీని సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గల్లా రామచంద్రరావుకు, కమిటీకి బోర్డు గౌరవ సభ్యులైన వీవీ నర్సయ్య, జి.పున్నారావు, కె.రామకోటేశ్వరరావు, వి.శ్రీనివాసరావు, రాజవరపు రవి, ఎంఎం కొండయ్యలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గల్లా రామచంద్రరావు మాట్లాడుతూ, నారెడ్‌కో అమరావతి అధ్యక్షుడిగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ప్రతిఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ.. రియల్ ఎస్టేట్ రంగంలో ప్రతిఒక్కరికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని, ఎవరికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా భవిష్యత్తులో అసోసియేషన్ మరింత అభివృద్ధి చెందే విధంగా పనిచేస్తానన్నారు. రాజధాని అమరావతి ప్రాంతంలో అన్ని అనుమతులు ఉన్న అప్రూవుడ్ లే-అవుట్‌లు మాత్రమే చేయాలని, అటువంటి లేఔట్లను మాత్రమే నరెడ్‌కో ప్రోత్సహిస్తుందని గల్లా తెలిపారు. ముఖ్యంగా రాజధాని అమరావతి అభివృద్ధికి నారెడ్‌కో కొత్త కమిటీ శాయశక్తుల కృషి చేస్తుందని తెలిపారు.

కొత్త కమిటీ : అధ్యక్షుడిగా గల్లా రామచంద్రరావు, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎ.సాంబశివరావు, జనరల్ సెక్రటరీ ఎన్.రాంబాబు, కోశాధికారిగా మారం చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా పెద్ది సుబ్బారావు, ఎం.హనుమంతరావు, ఎం.రామకృష్ణ, వీవీకే చైతన్య, జాయింట్ సెక్రెటరీలుగా టి.దుర్గాప్రసాదరావు, జి.శివ నాగబాబు, అజీమతుల్లా, ఈసీ మెంబర్లుగా కేవీఎస్ రామాంజనేయులు, ఎం.సత్యనారాయణ, డి.రమేష్ కుమార్, కె.కృష్ణ, జి.కృష్ణ హేమంత్, డి.రమేష్ కుమార్ ఎన్నికయ్యారు.

అక్టోబరులో నూతన మద్యం పాలసీ

వరద బాధితులకు అన్ని సహాయ చర్యలు

ప్రజా దర్బార్‌లో సమస్యలకు పరిష్కారం : మంత్రి కొల్లు రవీంద్ర



బాధితురాలికి ఉత్తర్వుల కాపీ అందిస్తున్న రవీంద్ర

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 16 : వైసీపీ పాలనలో ప్రభుత్వ మద్యం దుకాణాల పేరుతో ప్రజల నుంచి కోట్లాది రూపాయలు దోచుకోవడంతో పాటు నాసిరకం మద్యం అందించిందని, ఈ విధానానికి స్వస్తి చెబుతూ అక్టోబరు మొదటి వారంలో నూతన పాలసీని ప్రవేశపెడుతున్నామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సోమవారం టీడీపీ నియోజకవర్గ కార్యాలయం వద్ద ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి మంత్రి పెద్ద ఎత్తున వినతి పత్రాలు స్వీకరించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ సోడిశెట్టి బాలాజీలతో పాటు టీడీపీ సీనియర్ నేత గొర్రెపాటి గోపీచంద్, గోపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజాదర్బార్‌లో ప్రజలు సమర్పించిన పలు సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. బుడమేరు వరద నష్టానికి జిల్లా మొత్తం అతలాకుతలమైందని, బాధితులకు ప్రభుత్వం సాయం అందిస్తుందన్నారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం కూడా నష్టపరిహారం చెల్లించేందుకు ముందుకు వచ్చిందన్నారు. టీడీపీ, జనసేన కార్యకర్తలు సంయమనం పాటిస్తూ కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి హితవు పలికారు. వాగ్వివాదాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సనకా నాగులు, పీవీ ఫణికుమార్, పిప్పళ్ల కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

బ్యారేజీపైకి భారీ పడవలు కుట్రదారులపై చర్యలు తప్పవు..

మచిలీపట్నం టౌన్ : విజయవాడ మణిహారం ప్రకాశం బ్యారేజిని కూల్చేందుకు 50 టన్నుల బరువున్న పడవలను వదిలిన కుట్రదారులు వైసీపీ నాయకులపై చర్యలు తప్పవని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సోమవారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడారు. బుడమేరు వరదతో విజయవాడ మహానగరంలో 32 డివిజన్లు నీట మునిగాయని, లక్షలాది మంది తీవ్రమైన అవస్థలకు గురయ్యారన్నారు. గన్నవరం, గుడివాడ, పెనమలూరు నియోజకవర్గాల్లో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారన్నారు. మాజీ సీఎం జగన్‌రెడ్డి బాధితుల వద్దకు వెళ్లకుండా విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పిలుపునకు స్పందించి పెద్ద ఎత్తున సేవలందించడంతో విజయవాడ నగరం కోలుకుందన్నారు. కరకట్టలు, బ్యారేజీల వద్ద తెల్లవార్లు కాపలా కాసిన అధికారులు, కార్యకర్తల రుణం తీర్చుకోలేమన్నారు. గత ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోకపోవడం వల్లే బుడమేరుకు వరదలు దాపురించాయన్నారు.

ఇసుక అక్రమ రవాణా.. రెండు ట్రాక్టర్ల సీజ్



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

చిట్యాల(తిరువూరు) : చిట్యాల సమీపంలోని కట్టలేరు వాగునుంచి కొందరు వ్యక్తులు, ఇసుక అక్రమ తోలకాలను యధేచ్ఛగా కొనసాగిస్తున్నారు. సోమవారం ఉదయం నుంచి వాగులో పెద్దఎత్తున ట్రాక్టర్లతో తెలంగాణ ప్రాంతానికి, ఇసుక రవాణా భారీగా జరిగినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇసుక, మట్టి అక్రమంగా తరలిస్తున్నా అధికారులు మిన్నకుండటం పట్ల, పలు అనుమనాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు పట్టణంలో వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా పోలీసులు రహదారిపై బందోబస్తు నిర్వహిస్తుండగా, ఇసుక ట్రాక్టర్లు వెళుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడం గమనార్హం. ఇదే విషయమై తహసీల్దార్ లక్ష్మిని వివరణ కోరగా.. ఇసుక తోలకాలపై సమాచారం వచ్చిందని, వాగువద్దకు రెవెన్యూ సిబ్బందిని పంపుతున్నట్టు తెలిపారు.

చిట్యాల వాగునుంచి ఇసుక తోలకాలు చేస్తున్న రెండు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఉదయం నుంచి భారీస్థాయిలో ఇసుక తరలిస్తున్నా మొక్కుబడిగా రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కూటమి ఫ్లెక్సీ ధ్వంసం



తుర్లపాడులో ధ్వంసం చేసిన ఫ్లెక్సీ

చందర్లపాడు : అధికారం కోల్పోయినా వైసీపీ చిల్లర మూకల ఆగడాలు ఆగడం లేదు. ఇటీవల వరదల వల్ల దెబ్బతిన్న ప్రజలను ఆదుకోవడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు చూపిన చొరవకు కృతజ్ఞతగా మండలంలోని తుర్లపాడు గ్రామంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. దీనిని ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఇది వైసీపీ మూకల చర్యేనని టీడీపీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. గ్రామాల్లో అశాంతిని రేకెత్తించే చిల్లర వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరుతున్నారు.



మంగినపూడి బీచ్‌లో వినాయక నిమజ్జనంలో భక్తులు

బై బై గణేశా..

- మంగినపూడి బీచ్‌లో 102 విగ్రహాల నిమజ్జనం

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 16 : మచిలీపట్నంలో సోమవారం మంగినపూడి బీచ్‌కు దాదాపు వంద వినాయక విగ్రహాలు నిమజ్జనానికి తరలాయి. మేళతాళాలు, డీజేలతో, జానపద నృత్య కళాకారులతో ఊరేగింపుగా బీచ్‌కు భక్తులు తరలివెళ్లారు. పండుగ వాతావరణంలో బీచ్‌కు ట్రాక్టర్లు, లారీలపై నిమజ్జనానికి విగ్రహాలను తీసుకుని వెళ్లారు. డీఎస్పీ అబ్దుల్ సుభాన్, ఆర్‌పేట సీఐ ఏసుబాబు, బందరు రూరల్ ఎస్ఐ నాగరాజులతో పాటు పెద్ద సంఖ్యలో పోలీసులు శాంతి భద్రతలను పరిరక్షించారు. మిలాద్ ఉన్‌నబి ర్యాలీలు, గణేష్ నిమజ్జన ర్యాలీలతో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించారు. సముద్ర తీరం విగ్రహాలతో రంగులమయమైంది.

విగ్రహ నిమజ్జనంలో రెండు వర్గాల వివాదం.. ఉద్రిక్తత

పెడన : పెడన బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం రాత్రి ఇరువర్గాల మధ్య వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. ముందు జాగ్రత్త చర్యగా పట్టణంలో పోలీసులు మోహరించారు. బస్టాండ్ సెంటర్‌లోని గణపతి ఆలయం సమీపంలో ఒక వర్గానికి చెందిన వారు జెండా కట్టగా మరో వర్గం అభ్యంతరం తెలిపింది. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య వాగ్వివాదం జరిగి పరిస్థితి ఉద్రిక్తంగా మారుతున్న సమయంలో పోలీసులు ఇరువర్గాలకు నచ్చచెప్పి శాంతింప చేశారు. జెండా కట్టిన వర్గానికి అనుకూలంగా ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన వ్యక్తులు విధ్వంసం సృష్టించారు. గణపతి ఆలయంపైన, విగ్రహంపైన రాళ్లదాడి చేశారు. ఈ దాడిలో విధులు నిర్వహిస్తున్న సీఐ నాగేంద్రప్రసాద్, కానిస్టేబుల్ నాగరాజుకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసు వాహనం పాక్షికంగా ధ్వంసమైంది. జెండా కట్టడాన్ని వ్యతిరేకించిన వర్గానికి చెందిన కొందరు దాడిలో గాయపడ్డారు. ఈ పరిస్థితుల్లో పోలీసులు లాఠీలకు పని చెప్పారు. దీంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. సోమవారం సాయంత్రం మళ్లీ గొడవలు జరిగే అవకాశం ఉండటంతో పట్టణంలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణ శివార్లలో పోలీసు పికెట్‌లు ఏర్పాటు చేశారు.

కమ్మనమోలు పొలాలకు నీరివ్వండి..



సాగునీరివ్వాలని కోరుతున్న సర్పంచ్, రైతులు

నాగాయలంక : నాగాయలంక సెంట్రల్ కాలువ 3ఏకు నీటి సామర్థ్యం పెంచి కమ్మనమోలు వరి పొలాలకు సమృద్ధిగా సాగునీరును అందించాలని భావదేవరపల్లి సర్పంచ్ మండలి ఉదయ భాస్కర్, కమ్మనమోలు ఉపసర్పంచ్ నాగులపాటి శ్రీనివాసరావు అధికారులను కోరారు. ఇటీవల కురిసిన వర్షాలకు కమ్మనమోలు, భావదేవరపల్లి పరిధిలోని ముంపు బారిన పడటంతో పైరును రక్షించుకునేందుకు పొలాల్లోని నీరును రైతులు డ్రైనేజీల్లోకి వదిలేశారన్నారు. అనంతరం వర్షాలు లేక, కాలువల నుంచి సమృద్ధిగా నీరు రాకపోవటంతో వందలాది ఎకరాల్లో కాలువ చివరి భూములకు సాగునీరందక వరి పొలాలు బీటలు వారుతున్నాయని ఆయకట్టు రైతులతో కలిసి ప్రజాప్రతినిధులు నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఇరిగేషన్ ఏఈ పి.రవితేజ కమ్మనమోలు వచ్చి ఎగువ ప్రాంతాల్లోని ఇంజన్లను తొలగించారు. వంతుల వారీగా కాలువ చివరి భూములకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నట్టు రైతులకు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	119, 128, 139
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.45

ఘనంగా మిలాద్-ఉన్-నబీ పర్వదినం

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 16 : సర్వమతాల సారాంశం, మానవులంతా ఒక్కటేనని చాటి చెప్పిన మహమ్మద్ ప్రవక్త బోధనలు ప్రతి ఒక్కరికీ శిరోధార్యమని స్థానిక ఏలూరు రోడ్డులోని మదీనా మసీదు మత గురువు షఫీకుర్ రెహమాన్ తెలిపారు. సోమవారం మిలాద్-ఉన్-నబీ పర్వదినం సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా మహమ్మద్ ప్రవక్త అందించిన సందేశాన్ని, ఆయన చేసిన సేవలను గుర్తుచేశారు. కాగా స్థానిక విజయవాడ రోడ్డులోని జమాతే ఇస్లామి హింద్ బిలాల్ మసీదులో మిలాద్-ఉన్-నబీ వేడుకను ఘనంగా నిర్వహించారు. మసీదు ఇమామ్ అబ్దుల్ అలీమ్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్ జంక్షన్ శాఖ అధ్యక్షుడు నసీర్ పాల్గొన్నారు.

నిమజ్జనం ప్రశాంతంగా జరపాలి



వినాయక మండపాల నిర్వాహకులతో మాట్లాడుతున్న ఉయ్యూరు సీఐ రామారావు

ఉయ్యూరు, సెప్టెంబరు 16 : వినాయక ప్రతిమల నిమజ్జనం సందర్భంగా ఏవిధమైన సంఘటనలకు తావు లేకుండా ప్రశాంతంగా జరపాలని ఉయ్యూరు సీఐ రామారావు సూచించారు. వినాయక ప్రతిమల నిమజ్జనం పురస్కరించుకుని సోమవారం ఉయ్యూరు పట్టణ పరిధిలో వినాయక చవితి మండ పాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు, హెచ్చరికలు చేశారు. డీజే బాక్సుల శబ్దాలు మితిమీరి పెట్టవద్దని, రాత్రి 9 గంటలకు నిమజ్జనం పూర్తిచేయాలని, ఊరేగింపు సందర్భంగా మద్యం సేవించి అల్లర్లకు పాల్పడితే చట్టపరంగా కేసులు నమోదు చేసి నిర్వాహకులను బాధ్యులను చేస్తామని హెచ్చరించారు. రాజకీయ పార్టీల పాటలు పెట్టి రెచ్చగొట్టేలా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణ ఎస్సై విశ్వనాథ్ నిర్వాహకులకు సూచనలు చేశారు.

దివ్యాంగులకు అన్నదానం



ఆశాజ్యోతి విద్యార్థులకు అన్నదానం చేస్తున్న టీడీపీ నేత చింతల వెంకటశివ అప్పారావు, రమాదేవి దంపతులు

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 16 : కానుమోలు మాజీ సర్పంచ్, టీడీపీ నాయకులు చింతల వెంకటశివ అప్పారావు, రమాదేవి దంపతులు సోమవారం స్థానిక ఏలూరు రోడ్డులోని ఆశాజ్యోతి దివ్యాంగుల ఆశ్రయంలో దివ్యాంగులకు అన్నదానం నిర్వహించారు. అప్పారావు కుమారుడు నాగవెంకట శివసుమంత్ జన్మదినం సందర్భంగా విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వేగిరెడ్డి బాలాజీ, పాఠశాల నిర్వాహకులు మరీదు వెంకటస్వామి. మాధవిలత తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



వాలీబాల్ పోటీల్లో విజేతలతో టీడీపీ నాయకుడు యనమదల సుధాకర్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 16 : మానసిక వికాసానికి, శారీరక దారుఢ్యానికి యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని యనమదల సుధాకర్ అన్నారు. రేమల్లె టీడీపీ నాయకుడు యనమదల సుధాకర్ జన్మదినోత్సవం సందర్భంగా ఆదివారం రాత్రి వడ్లమూడి జానకీరామ్మూర్తి ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేసి యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను సుధాకర్ కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు యనమదల శ్రీనివాసరావు, సుదర్శన రావు, తుమ్మల వీరయ్య, చల్లగుళ్ల పాండు, సాంబశి వరావు, గణేష్, పల్లెపాము వంశీ, బెజవాడ శివయ్య, సొదిమెళ్ల శేషు తదితరులు పాల్గొన్నారు.

ఎంజీనగర్ కాలనీకి మోక్షం

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 16 : ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాలతో స్థానిక ఎంజీనగర్ కాలనీ రోడ్లకు మోక్షం కలిగింది. నివాసాల మధ్య మార్గాలను అభివృద్ధి చేసే పనులు చేపట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కాలనీ జలమయం అయ్యింది. కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందిని ఎదుర్కొన్నారు. కాలనీ వాసుల సమాచారం మేరకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కాలనీని సందర్శించి కాలనీవాసులకు ఇబ్బందిపడకుండా నివాసాల మధ్య ఉన్న మార్గాలను మెరక చేసి అభివృద్ధి పరచాలని ఎంపీడీవో కె.జోగేశ్వరరావును ఆదేశించారు. దీంతో కంకరు డస్ట్‌తో నివాసాలు మధ్య ఉన్న మార్గాలను మెరక చేసే పనులను సోమవారం చేపట్టారు. ఆ పనులను పీఆర్ ఏఈ జయరాజు, ఉప సర్పంచ్ దుట్టా శివన్నారాయణ, వార్డు సభ్యులు కడవకొల్లు నాగరాజు, కంచర్ల సత్యనారాయణ, స్థానిక నాయకులు కడవకొల్లు రాజేష్, సత్తార్ తదితరులు పర్యవేక్షించారు.

స్ఫూర్తి ప్రదాతలు

● వరద బాధితుల సహాయార్థం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు రూ.5 లక్షలు అందజేసిన మానికొండ గ్రామస్థులు



విజయవాడ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే యార్లగడ్డకు విరాళం అందజేస్తున్న మానికొండ గ్రామస్థులు

ఉంగుటూరు, సెప్టెంబరు 16 : బుడమేరు వరద ముంపుతో సర్వస్వం కోల్పోయి కష్టాల్లో వున్న వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకురావటం అభినందనీయమని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బుడమేరు వరద బాధితుల సహాయార్థం ఉంగుటూరు మండలంలోని మానికొండ గ్రామప్రజలనుంచి సేకరించిన రూ. మూడు లక్షలు, గ్రామపెద్దలు సూరెడ్డి బుచ్చియ్య వంశీకులు అందజేసిన రూ. రెండు లక్షల నగదును సోమవారం విజయవాడ గురునానక్‌కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే యార్లగడ్డను గ్రామపెద్దలు కలిసి అందజేశారు. సదరు సొమ్మును సీఎం సహాయనిధికి అందించాల్సిందిగా యార్లగడ్డను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరదలతో తీవ్రంగా నష్టపోయిన బాధితులకు ఆపన్నహస్తం అందించేందుకు గ్రామీణప్రాంతాల్లోని సాధారణ ప్రజానీకంతో పాటు, రైతాంగం సైతం మానవతా దృక్పథంలో స్పందించి తమవంతు సాయంగా విరాళాలు అందించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు యడ్లపల్లి సాయిబాబు, షేక్ అజీజ్, ఆరికట్ల రవికుమార్, యాసం పార్వతీశం, నర్ని వెంకటేశ్వరరావు, బెజవాడ నాగేశ్వరరావు, పాతూరి రాజ్‌కుమార్, సూరెడ్డి రామమోహనరావు, గోగినేని బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

వస్త్రాలు, సామగ్రి పంపిణీ

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : విపత్కర పరిస్థితుల్లో వరద ముంపుతో ఇళ్లలోకి నీరు చేరి సర్వం కోల్పోయిన బాధితులకు దాతలు అండగా నిలవడం అభినందనీయమని ఎస్సై జనార్దన్ అన్నారు. రంగయ్యప్పారావుపేటలో వరద ముంపునకు గురైన కుటుంబాలకు జ్యులిత్ డాట్ కామ్ వ్యవస్థాపకులు దుట్టా శమంతకమణి, రవిబాబు అందజేసిన వస్త్రాలు, సామగ్రిని సర్పంచ్ కాకొల్లు అన్నామణి, పరుచూరి రామకృష్ణలతో కలిసి సోమవారం పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ నలుబోయిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 150మంది బాధితులకు భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో లింగం శ్రీధర్, బోయపాటి ప్రసాద్, శేఖర్, ఆలూరి బాబు, కొల్లిపర శ్రీనివాస్ పాల్గొన్నారు.



వరద బాధితులకు దుస్తులు, సామగ్రి అందజేస్తున్న దుట్టా శమంతకమణి, రవిబాబు

ఓజోన్ పొర రక్షణపై అవగాహన



ఉయ్యూరులో ఏజీ అండ్ ఎస్ జీఎస్ కళాశాల విద్యార్థుల మానవహారం

ఉయ్యూరు, సెప్టెంబరు 16 : అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం పురస్కరించుకుని సోమవారం ఏజీ అండ్ ఎస్ జీఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓజోన్ ప్రాముఖ్యత తెలియజేస్తూ కళాశాల నుంచి ప్రధాన సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కళాశాలలో ప్రిన్సిపాల్ శివనాథ్, ప్రత్యేక అధికారి సత్యనారాయణ మొక్కలు నాటారు. రసాయనశాస్త్ర విభాగ అధిపతి జి.గిరిప్రసాద్, కిషోర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

● లయన్స్ క్లబ్ ఉయ్యూరు జోన్ ఆధ్వర్యంలో అంతర్జాయతీ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. జోన్ చైర్‌పర్సన్ ఎండీ ఇస్మాయిల్ పర్యవేక్షణలో ఆకునూరులో జరిగిన కార్యక్రమంలో ఏవో కాకాని వెంకటరత్న ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని ఓజోన్ రక్షణ అవగాహనపై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ల తేజ, ట్రెజరర్ దినవహి ప్రసాద్ పాల్గొన్నారు.

వెల్దిపాడు రోడ్డుకు మరమ్మతులు

ఉంగుటూరు, సెప్టెంబరు 16 : వరదల కారణంగా పిల్లికోడు వాగు దాల్చిన ఉగ్రరూపానికి వెల్దిపాడు ప్రధాన తారురోడ్డు కొట్టుకుపోయింది. పిల్లికోడు వంతెనపై నుంచి నాలుగు అడుగుల మేర వరదనీరు ఉధృతంగా ప్రవహించడంతో ఐదురోజులపాటు గ్రామంలోకి రాకపోకలు స్తంభించాయి. స్థానిక జడ్పీ హైస్కూల్ దగ్గర నుంచి ఎంపీపీ పాఠశాల వరకు పిల్లికోడు వాగు వంతెనకు ఇరువైపులా సుమారు 200 మీటర్ల మేర రోడ్డు వరద తాకిడికి పూర్తిగా దెబ్బతింది. అక్కడక్కడ పెద్దగుంతలు ఏర్పడి రోడ్డు రూపురేఖలు కోల్పోయింది.

పంట నష్టపరిహారం పెంచాలి

ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.కేశవరావు



ఎలుకపాడులో వరదనీటిలో మునిగిపోయిన వరిని పరిశీలిస్తున్న రైతు సంఘం నేతలు

గన్నవరం, సెప్టెంబరు 16 : బుడమేరు, ఏలూరు కాలువ ముంపు ప్రాంతాలకు ప్రభుత్వం ప్రకటించిన పంట నష్టపరిహారంచాలదని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వైకేశవరావు అన్నారు. సోమవారం స్థానిక సంఘ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రకటించిన రూ.10వేల సాయం సరిపోదన్నారు. నష్టపరిహారాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. కేసరపల్లి ఏలూరు కాలువకు పడిన గండిని పూడ్చాలన్నారు. బుడమేరు ముంపుపై 1960 నుంచి ఆయా ప్రభుత్వాలు మిత్ర, బుర్రా, శివరామకృష్ణ కమిటీలు వేశాయని ఆ కమిటీలు తమ నివేదికల్లో వెల్లడించిన అంశాలను వదిలేశాయన్నారు. 20వేల క్యూసెక్కుల ప్రవాహాన్ని మాత్రమే తట్టుకునే బుడమేరులో అనేక వాగులు, కాలువలు కలిసి 48వేల క్యూసెక్కుల నీటితో వరద వెల్లువెత్తిందన్నారు. అందుకే విజయవాడ ముంపునకు గురైందన్నారు. నాయకులు హరిబాబు, కృష్ణయ్య, నాగేశ్వర రావు, లక్ష్మణస్వామి, సూరగాని సాంబశివరావు, కైలే ఏసుదాసు, బేతా శ్రీనివాసరావు, ఆవుటపల్లి సాంబయ్య పాల్గొన్నారు.

భూమి ప్రాతిపదికగా ఎన్యుమరేషన్ చేయాలి

ఉంగుటూరు : ప్రభుత్వం చేపట్టిన ఎన్యుమరేషన్ ప్రక్రియ గ్రామాల ప్రాతిపదికన కాకుండా నష్టం జరిగిన భూమి ప్రాతిపదికగా జరపాలని రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య అన్నారు. రైతుసంఘం, కౌలురైతుసంఘం రాష్ట్రకమిటీల ఆధ్వర్యంలో నేతల బృందం సోమవారం మండలంలోని ముంపు ప్రాంతాలైన వెల్దిపాడు, ఎలుకపాడు, ఉంగుటూరు, కొయ్యగూరపాడు, ఓంద్రంపాడు, ఆముదాలపల్లి, లంకపల్లి తదితర గ్రామాల్లో పర్యటించారు. ఆయాగ్రామాల్లో రైతులతో మాట్లాడి జరిగిన నష్టం గురించి అడిగి తెలుసుకున్నారు. నష్టపోయిన ప్రతిరైతుకు తగిన పరిహారం అందించి ఆదుకునేవిధంగా ప్రభుత్వంతో చర్చిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌలురైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టీవీ లక్ష్మణస్వామి, జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు, నాయకులు బి.నాగేశ్వరరావు, బేత శ్రీనివాసరావు, కళ్లం వెంకటేశ్వరరావు, అజ్మీర్ వెంకటేశ్వరరావు, రైతులు రామకృష్ణ, శ్రీనివాసరావు, సుగుణరావు, తదితరులు పాల్గొన్నారు.

మర్లపాలెంకు సర్వీస్ రోడ్డు నిర్మించాలి

కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మకు టీడీపీ, బీజేపీ నాయకుల వినతి



కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గన్నవరం, సెప్టెంబరు 16 : మండలంలోని మర్లపాలెం మీదుగా వెళ్లిన బైపాస్‌కు సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మకు టీడీపీ, బీజేపీ నాయకులు సోమవారం విజయవాడలో వినతి పత్రాన్ని అందజేశారు. గుండుగొలను నుంచి కాజా బైపాస్ రోడ్డు నిర్మించిన సందర్భంలో మర్లపాలెంలో రైతులు కూడా తమ భూములను కోల్పోయారని వివరించారు. ఆ గ్రామస్థులతో పాటు పలు గ్రామాలకు చెందిన ప్రజలు కూడా సర్వీస్ రోడ్డు లేకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, జాస్తి మురళీకృష్ణ, కంభంపాటి కృష్ణ కిషోర్, ఆరుమళ్ల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న దేవరపల్లి విద్యాసాగర్

గన్నవరం, సెప్టెంబరు 16 : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి దేవరపల్లి విద్యాసాగర్ అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. తక్షణమే ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి తమ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. జీవో నెంబర్-117ను రద్దు చేయాలన్నారు. గత మూడేళ్ల నుంచి సంపాదిత సెలవుల నగదు జమ చేయాలన్నారు. మధ్యంతర భృతి తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎంవీ ఎస్ఎన్ ప్రసాద్, పి.ఇమ్మానియేలు, డి.చంద్రశేఖర్, మండవ గౌరిశంకర్ పాల్గొన్నారు.

ఆదర్శమూర్తి యలమంచిలి విజయలక్ష్మి



విజయలక్ష్మి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, సెప్టెంబరు 16 : ఆదర్శమూర్తి యలమంచిలి విజయలక్ష్మి అని ఎమ్మెల్యే యార్లగడ వెంకట్రావు అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి పుణ్యచారిటీస్ చైర్ పర్సన్ యలమంచిలి విజయలక్ష్మి పంచమ వర్ధంతి సోమవారం నిర్వహించారు. ఆమె విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదలకు సేవ చేయాలనే దృక్పథం కలగటం అభినందనీయమన్నారు. వృద్ధులకు సామాజిక సహృదయంతో ట్రస్ట్ ఏర్పాటు చేయటం గొప్ప విషయమన్నారు. పుణ్యచారిటీస్ వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేసి వృద్ధులకు సేవలందిస్తున్న వారు స్ఫూర్తి ప్రదాతలన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి బాలవర్ధనరావు, డాక్టర్ సీఎల్ వెంకట్రావు, పుణ్యచారిటీస్ కార్యదర్శి జాస్తి విజయభూషణ్ కుమార్ (బుజ్జి), ఆళ్ల గోపాలకృష్ణ, గుండపనేని ఉమావరప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు, గూడపాటి తులసీమోహన్, అక్కినేని రాజా, సూరంపల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణేశ్ నిమజ్జనాలు





కానూరు ఎస్సీ కాలనీలో గ్రామోత్సవం, జంక్షన్‌లో లడ్డూను స్వీకరిస్తున్న వాసవిదేవి

పెనమలూరు, సెప్టెంబరు 16 : మండలంలో వినాయక నిమజ్జనాలు ఊపందుకున్నాయి. కానూరు, పోరంకి, తాడిగడప, యనమలకుదురు గ్రామాల్లో వినాయక కమిటీల ఆధ్వర్యంలో వినాయకుడిని ఊరేగించి నిమజ్జనాలకు తీసుకెళ్లారు. వినాయక పందిళ్ల వద్ద అన్నసంతర్పణ గావించారు. కానూరు పెద్దబావి సెంటర్లో వరసిద్ధి వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. వినాయకుని ఊరేగింపు సందర్భంగా 24కిలోల స్వామివారి లడ్డూను పెదపూడి దాసు, ఉయ్యూరు శ్రీనివాస్, గండికోట నరసింహరావు, వై శ్రీనివాసరావు, రావిపూడి వాసులు ఉమ్మడిగా రెండు లక్షల డెబ్బై ఐదువేలకు పాడారు. వారికి లడ్డూ ప్రసాదాన్ని కమిటీ సభ్యులు మాదు రామకృష్ణ, మాదు మురళిలు అందించారు. ●కానూరు ఎస్సీ కాలనీలో వినాయక ఊరేగింపు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. డప్పులు, వాయిద్యాలతో స్థానిక యువకు లు వినాయక నిమజ్జనానికి తరలివెళ్లాడు. ఈ సందర్భంగా వార్డు టీడీపీ బాధ్యులు అంగిరేకుల మురళిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వెలిసెల సుబ్రహ్మణ్యం, అశోక్, మూర్తి, శేఖర్, కాలనీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉయ్యూరులో..

ఉయ్యూరు : ఉయ్యూరు, పరిసర గ్రామాల్లో సోమవారం వినాయక నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. పట్టణ పరిధిలో చింతలతోట, బస్‌స్టాండ్ సెంటర్, సుందరమ్మపేటలో మండపాల నుంచి వినాయక ప్రతిమలు ఊరేగింపుగా తీసుకువెళ్లి పుల్లేరులో నిమజ్జనం చేశారు. మూర్తిరాజుపాలెంలో వినాయక మండపం వద్ద పూజల్లో బాలబాలికలు, మహిళలు పాల్గొన్నారు.

పోటాపోటీగా లడ్డూ వేలం పాట

హనుమాన్‌జంక్షన్ : స్థానిక ఏలూరు రోడ్డులోని గాంధీనగర్‌లో గణపతి నవరాత్రులు పురస్కరించుకొని వినాయక ఉత్సవ మండపంలో నిమజ్జనం సందర్భంగా ఆదివారం రాత్రి నిర్వహించిన లడ్డూ ప్రసాదం వేలం పాట పోటా పోటీగా సాగింది. పాటలో ఐదు కేజీలు లడ్డూ ప్రసాదాన్ని ఏలూరు పార్లమెంటరీ టీడీపీ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు వడ్డి వాసవిదేవి రూ.36,200లకు సొంతం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు మోగంటి కొండలు, గరికపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : బాపులపాడు మండల వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రంగన్నగూడెంలో ఏర్పాటు చేసిన మండపంలోని గణపతికి సోమవారం ఆళ్ల గోపాలకృష్ణ, మొక్కపాటి సత్యనారాయణ, కసుకుర్తి అర్జునరావు తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామోత్సవం నిర్వహించి, పోలవరం కాలువలో నిమజ్జనం చేశారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	119, 128, 139
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.45

నాగాయలంకలో 1209 ఎకరాల్లో వరికి నష్టం


కమ్మనమోలులో పాడైన వరి

నాగాయలంక : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలో 1209 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్టు వ్యవసాయాధికారులు తెలిపారు. మండలంలోని 11 రెవెన్యూ గ్రామాల్లో దాదాపుగా 18,175 హెక్టార్లలో రైతులు వరి సాగును చేశారు. అందులో 1500 ఎకరాలు ముంపు బారిన పడింది. 9 రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూశాఖ, వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేయగా 1209 ఎకరాల్లో నష్టం జరిగినట్టు తేల్చారు. భావదేవరపల్లి, కమ్మనమోలు, టి.కొత్తపాలెం, ఏటిమొగ, చోడవరం, నంగేగడ్డ, గణపేశ్వరం, పర్రచివర, తలగడదీవి రెవెన్యూ గ్రామాల్లో వరి పంట దెబ్బతిన్నట్టు చెప్పారు.


బందరు మండలం సీతారామపురం వద్ద వరద ముంపునకు గురైన పంట పొలాలు

పంట.. తంట!

- బందరు మండలంలో రైతన్నలకు వింత దుస్థితి
- వరదతో కొన్ని గ్రామాల్లో పంటలు నీటిపాలు
- నీరులేక ఇంకొన్ని గ్రామాల్లో పంటలు ఎండుముఖం
- సాగునీటి కోసం మంత్రిని కలిసిన కోన రైతులు

బందరు మండలంలో రైతన్నలకు వింత పరిస్థితి ఎదురవుతోంది. ఒకపక్క అతివృష్టితో పంటలన్నీ అతలాకుతలం అయ్యాయి. మరోపక్క నీరులేక వరి పొలాలు ఎండుముఖం పడుతున్నాయి. ఈ రెండూ బందరు మండలంలోనే చోటుచేసుకుంటున్నాయి. భారీ వర్షాలు, వరదలతో ఎస్ఎన్‌గొల్లపాలెం, సీతారామపురం గ్రామాల్లో వరి పంట... మంగినపూడి, సమీప గ్రామాల్లో వేరుశనగ నీటిపాలయ్యాయి. ఇప్పటికీ ముంపులోనే ఉన్నాయి. మరోపక్క కోన గ్రామంలో వరి పంటకు సాగునీరందక రైతులు అల్లాడిపోతున్నారు. నీటి కోసం ఆ గ్రామ రైతులు సోమవారం మంత్రి కొల్లు రవీంద్రను ప్రజాదర్బార్‌లో కలిసి సమస్యను విన్నవించుకున్నారు.పెట్టారు. ఏడవ నెంబరు కాల్వ కింద కోన గ్రామంలో 500 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో కోన గ్రామానికి చెందిన రైతులు కోమటి శ్రీను, గంజాల శ్రీరాములు, పేరుబోయిన నాగరాజు, కోమటి శివరామకృష్ణ, కోమటి బాబులు, గంజాల తాతయ్యతో పాటు పలువురు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. - మచిలీపట్నం టౌన్


కోన గ్రామంలో సాగునీరందక నెర్రెలిచ్చిన వరి పొలం

సామూహిక మణిదీపేశ్వరి పూజలు

నాగాయలంక : నాగాయలంకలోని ప్రసన్న గణపతిస్వామి ఆలయ ప్రాంగణంలోని ఉత్సవ పందిరిలో 67వ వార్షిక వినాయక నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం 10వ రోజు వేదపండితులు అంబా సాయి కిరణ్ శర్మ బ్రహ్మత్వంలో సామూహిక మణిదీపేశ్వరి అమ్మవారి పూజలను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత లంబోదరుడికి ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. ఈ కార్యక్రమాలను ఉత్సవ కమిటీ పర్యవేక్షించింది.

అశోక్ నాయుడికి రాయపూడి పరామర్శ

కోడూరు : చిరంజీవి యువత అవనిగడ్డ నియోజకవర్గ అధ్యక్షుడు, జనసేన నాయకులు సిద్ధినేని అశోక్ నాయుడిని జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు పరామర్శించారు. సోమవారం ఉల్లిపాలెంలో వారి స్వగృహం వద్ద మాతృవియోగానికి గురైన అశోక్ నాయుడును పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతిని తెలియజేశారు. స్థానిక పార్టీ నేతలు పాల్గొన్నారు.


బాధితులకు వంట పాత్రలు అందిస్తున్న మండలి బుద్ధప్రసాద్

మేమున్నామని..

- వరద బాధితులకు అండగా నిలుస్తున్న మానవతావాదులు
- వివిధ రూపాల్లో ఇప్పటికీ అందుతున్న వరద సాయం

ఇటీవల వర్షాలు, వరదలకు సర్వం కోల్పోయిన వారికి సహృదయులు, మానవతావాదులు అండగా నిలుస్తున్నారు. ప్రతిఒక్కరూ తమకు తోచిన మేరకు ఏదో ఒక రూపంలో సాయం చేస్తూనే ఉన్నారు. ఆహారం, దుస్తులు, వంట సామగ్రి.. ఇలా ఒక్కొక్కరూ ఒక్కో రూపంలో సాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. సోమవారం కూడా వరద బాధితులకు అనేక మంది సాయం అందించారు.

ప్రభుత్వ కళాశాల పూర్వ విద్యార్థుల వితరణ

అవనిగడ్డ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు 2000-2003 బీకాం బ్యాచ్ విద్యార్థులు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఇటీవల వరదల కారణంగా నిరాశ్రయులైన కుటుంబాలకు తమవంతు సహాయం అందించారు. తోట్లవల్లూరు మండలంలో కాళింది దిబ్బ, అవనిగడ్డ మండలంలో దక్షిణ చిరువోలులంక గ్రామస్థులకు 15 రకాల నిత్యావసరాల వస్తువులతో కూడిన ఒక్కొక్క ప్యాకెట్ రూ.2 వేల ఖరీదు చేసే 125 ప్యాకెట్లను పంచారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ డా.డి.ఉమారాణి, కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం కమిటీ కన్వీనర్ డా.ఏ.వీరకుమారి అభినందించారు.

2600 కుటుంబాలకు వంట పాత్రల పంపిణీ

మోపిదేవి : నియోజకవర్గంలోని వరద ప్రభావిత గ్రామాల్లో 2600 బాధిత కుటుంబాలకు నియోజకవర్గ విద్యా కుటుంబం ఆధ్వర్యంలో రూ.29.78 లక్షలతో వంటపాత్రలు అందించారు. సోమవారం మోపిదేవి మండలంలోని బొబ్బర్లంకలో శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్, రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ డి.దేవానందరెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సర్పంచ్ దొప్పలపూడి గంగాభవాని, ఎంపీపీ రావి దుర్గావాణి, ఎంపీటీసీ దిడ్ల రాణి పాల్గొన్నారు.

300 కుటుంబాలకు నిత్యావసరాల వితరణ

అవనిగడ్డ రూరల్ : మండల పరిధిలోని దక్షిణ చిరువోలులంకలో 300 మంది వరద బాధితులకు కోడూరులోని కోట రాఘవయ్య విద్యాసంస్థలు, రవితేజ ఇంగ్లీష్ మీడియం స్కూల్, కోట రాఘవయ్య జూనియర్, డిగ్రీ కళాశాలల కరస్పాండెంట్ కోట వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో రూ.1.60 లక్షల నిత్యావసర సరుకులు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేతులమీదుగా అందజేశారు.

క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో బియ్యం, పండ్లు, సరుకులు..

చల్లపల్లి : వెలివోలులో ఇండియన్ ఇవాంజికల్ చర్చ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో వరద బాధితులకు సహాయం అందించారు. మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బిషప్ స్టీఫెన్ జోసఫ్ ఆర్థిక సాయంతో పోతార్లంక, రావిలంక, రాముడుపాలెం, పాపవినాశనం, వెలివోలు, పాపాయిలంక గ్రామాలకు చెందిన 300 మంది వరద బాధితులకు బియ్యం, నిత్యావసర సరుకులు, పండ్లు అందించడంపై ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ అభినందనలు తెలిపారు.

ఆముదార్లంకలో నిత్యావసరాల పంపిణీ

చల్లపల్లి మండలం ఆముదార్లంకలో ఇటీవల సంభవించిన వరదల కారణంగా నష్టపోయిన కుటుంబాలకు ఎస్టీయూ రాష్ట్ర నాయకులు కొమ్ము ప్రసాద్ మిత్ర బృందం, కృష్ణాజిల్లా ఎమ్మార్పీఎస్‌ల ఆధ్వర్యంలో రూ.లక్ష వ్యయంతో 100 మంది బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు, టవల్స్ అందచేశారు.

దోమ తెరలు, దుప్పట్ల పంపిణీ


శ్రీనివాసపురంలో దోమల తెరలు పంపిణీ చేస్తున్న వెనిగండ్ల రాము

నందివాడ (శ్రీనివాసపురం) : బుడమేరు వరద ముంపు ప్రాంతం అయిన నందివాడ శివారు శ్రీనివాసపురం ఎస్సీ, ఎస్టీ వరద బాధితులకు సుమారు 300 మందికి గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో గుడివాడ రోటరీక్లబ్ పాలకవర్గం ఏర్పాటు చేసిన దోమ తెరలను సోమవారం గ్రామస్థులకు అందజేశారు. ●మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వరద బాధితులకు సుమారు 300 మందికి దుప్పట్లు పంపిణీ కార్యక్రమం సోమవారం గ్రామస్థులకు అందజేశారు. ● మహావీర్ జువెలరీ గోల్డ్ షాపు (గుడివాడ) ఏర్పాటు చేసిన సుమారు 150 దుప్పట్లను కుదరవల్లి గ్రామ వరద బాధితులకు, వృద్ధులకు మాజీ సర్పంచ్ మసిముక్కు వేణు ఆధ్వర్యంలో దుప్పట్లు సోమవారం అందించారు.

వసుమట్లలో వరద సాయం


ధనియాలపేటలో..

అవనిగడ్డ రూరల్ : అవనిగడ్డ పంచాయతీ పరిధిలోని పులిగడ్డ ఏరియాలో ఉన్న వసుమట్లలో వరద బాధితులకు పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ చొరవతో ఆయన బంధువులు లక్ష రూపాయల విలువైన నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

గుడివాడ : స్థానిక ధనియాలపేటలోని ఇండియన్ బాప్టిస్ట్ బైబిల్ మిషన్ న్యూ లైఫ్ చర్చి ఆధ్వర్యంలో సోమవారం రెవరెండం జాన్ మాథ్యూస్ ఆదేశాల మేరకు పాస్టర్ కె.ఆనంద్‌పాల్ ఆధ్వర్యంలో విజయవాడలోని బుడమేరు ముంపు బాధితులకు నిత్యావసర వస్తువులను అందించారు.

260 కుటుంబాలకు నిత్యావసరాల కిట్ల పంపిణీ

తోట్లవల్లూరు : ఐలూరు శివారు కనిగిరిలంక, ములకలపల్లిలంక గ్రామాల్లో సోమవారం ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, దాతల ఆధ్వర్యంలో 260 వరద బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు.

ర్యాలీని అడ్డుకున్న పోలీసులు

పెడనలో స్వల్ప ఉద్రిక్తత

పెడన : మిలాద్ ఉన్ నబి పండుగ సందర్భంగా ముస్లింలు సోమవారం పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని పెద్ద మసీదు నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ బస్టాండ్ సెంటర్ వైపు వెళుతుండగా మార్గ మధ్యంలోని పురపాలక సంఘ కార్యాలయం వద్ద ర్యాలీని పోలీసులు ఆపేశారు. తాము బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీని కొనసాగిస్తామని ముస్లిం యువకులు చెప్పగా పోలీసులు నిరాకరించారు. బస్టాండ్ సెంటర్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నందున అక్కడ వరకు ర్యాలీ కొనసాగితే శాంతి భద్రతలకు భంగం కలుగుతుందని పోలీసులు నచ్చచెప్పినా ముస్లిం యువకులు వినలేదు. తాము బస్టాండ్ సెంటర్ వరకు వెళ్లాల్సిందేనని యువకులు పట్టుబట్టగా వెళ్లనివ్వబోమని పోలీసులు స్పష్టం చేశారు. ముస్లిం యువకులు, పోలీసులకు మధ్య వాదోపవాదాలు, తోపులాటలు జరిగాయి. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండటంతో మిలాద్ ఉన్ నబీ కమిటీ పెద్దలు జోక్యం చేసుకుని శాంతి భద్రతల సమస్య తలెత్తుతుందని పోలీసులు చెబుతున్నందున వారికి సహకరించాల్సిన బాధ్యత మనపై ఉందని ముస్లిం యువకులకు నచ్చజెప్పారు. అనంతరం ముస్లిం యువకులు పురపాలక సంఘ కార్యాలయం వరకే ర్యాలీని పరిమితం చేసి వెనుతిరిగారు.


ముస్లింలకు, పోలీసులకు మధ్య వాగ్వివాదం


లడ్డూను పాడుకున్న భక్తులతో ఎమ్మెల్యే రాము, రావి


నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు


నరసింహపురంలో నిమజ్జనానికి తరలుతున్న గణేశుడు

వెళ్లి రావయ్యా.. బొజ్జ గణపయ్య

- జిల్లాలో ముగిసిన వినాయక నవరాత్రులు
- ఉత్సాహంగా సాగిన గణేశ నిమజ్జనాలు

జిల్లాలో వినాయక నవరాత్రులు ఘనంగా ముగిశాయి. వాడవాడలా డప్పు వాయిద్యాలు, చెవులు మోతమోగేలా డీజేలతో ఉరేగింపులతో గణేశ నిమజ్జనాలు ఘనంగా జరిగాయి.

గుడివాడ : స్థానిక మెయిన్‌రోడ్డులో విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో వినాయక నవరాత్రులు ఘనంగా ముగిశాయి. స్వామి వారి లడ్డు ప్రసాదానికి బహిరంగ వేలం నిర్వహించగా భక్తులు రూ.1,17,000 లకు పాడుకున్నారు. స్థానిక కూరగాయల మార్కెట్‌లో యలవర్తి యూత్, యలవర్తి యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి సోమవారం మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పామర్రు : పట్టణంలోని తోట కాపుల రామాలయం వద్ద ఏర్పాటు చేసిన గణేషుడు లడ్డూను వేలం పాటలో విజయవాడకు చెందిన అల్లంశెట్టి కోటేశ్వరరావు రూ.60 వేలకు దక్కించుకున్నారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించి పుల్లేటి కాల్వలో వినాయక నిమజ్జనం చేశారు. వివిధ ప్రాంతాల్లోనూ గణేశ నిమజ్జనాలు ఘనంగా జరిగాయి.


పామర్రులో గణనాథుడి ఊరేగింపు

కపిలేశ్వరపురం (పమిడిముక్కల) : పమిడిముక్కల మండల పరిధి గ్రామాల్లో సోమవారం వినాయక నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. కపిలేశ్వరపురంలో తాతినేని రమేష్, గ్రామస్థుల ఆధ్వర్యంలో వినాయక విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువెళ్లి కాల్వలో నిమజ్జనం చేశారు.

అవనిగడ్డ రూరల్ : మోదుమూడి వంతెన సెంటర్‌లో నాయుడు యూత్ ఆధ్వర్యంలో గణేశ నిమజ్జనం సందర్భంగా వేలంలో లడ్డూనూ నందూరి నాగ వేణు దక్కించుకున్నారు.

కోడూరు : నక్కవానిదారి, విశ్వనాథపల్లి, ఇరాలి, కోడూరు బ్రాహ్మణ కాలనీ, ఇస్మాయిల్ బేగ్‌పేట, నరసింహాపురం, వేటపాలెం, స్వతంత్రపురం గ్రామాల్లో లడ్డూల వేలం, ప్రసాదాల పంపిణీ, సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహించారు.


అన్నదానం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

ఘనంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు

గుడివాడ : మిలాద్-ఉన్-నబీ సందర్భంగా స్థానిక బంటుమిల్లి రోడ్డులోని షాహీ మసీదులో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొని అన్నదానం ప్రారంభించారు. ఈ వేడుకల్లో మత గురువులు మొహబూబ్ బేగ్, మసీదు కమిటీ సభ్యులు గాంధీ, రషీద్ బేగ్, ఖాజా, మొహిద్దీన్, షరీఫ్, సలాం, కరీముల్లా, మొబిన్, జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, మైనార్టీ పెద్దలు షేక్ ఇబ్రహీం, షేక్ సర్కార్, సయ్యద్ జబీన్, మహ్మమద్ రఫీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చల్లపల్లి : ఇస్లాం మతగురువు మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజు(మిలాద్ ఉన్ నబీ)ను ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. చల్లపల్లిలో ముస్లిం సోదరులు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చల్లపల్లి పెద్దమసీదు వద్ద ఇస్లాం పతాకాన్ని ఎగురవేసి అతిపెద్ద ఇస్లాం జెండాతో ముస్లిం సోదరులంతా గ్రామ పురవీధుల్లో ప్రదర్శన చేపట్టారు. ప్రవక్తను స్మరించుకుంటూ నినాదాలు చేశారు.

పామర్రు : స్థానిక జమాత్ ఇస్లామ్ హింద్ శాఖ ఆధ్వర్యంలో ప్రవక్త జన్మదినాన్ని వివరించే ప్రత్యేక గ్రంథాలను పలువురు అధికారులకు, ప్రజాప్రతినిధులకు, వైద్యులకు అందజేశారు.

గుడ్లవల్లేరు : మహ్మద్ ప్రవక్త జన్మదినోత్సవ మైన మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. డోకిపర్రు తురాయిపాలెం, వేమవరం, కౌతవరం, గుడ్లవల్లేరు, పెంజంద్ర, కట్టావిచెరువు, సుబ్బిచెరువు, శేరిదగ్గుమిల్లి, ఉలవలపూడి గ్రామాల్లో మసీదుల్లో ముస్లీమ్ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

కాపు సంక్షేమ భవనాలకు మోక్షమెప్పుడు?

కోడూరు : కాపు సామాజిక తరగతి ప్రజల కోసం గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో మంజూరు చేసిన సంక్షేమ భవనాల నిర్మాణం వైసీపీ పాలనలో ఒక్క అడుగు ముందుకు పడలేదు. నాడు శంకుస్థాపన చేసిన శిలాఫలకాలు నేడు పిచ్చిమొక్కల మాటున విరిగిపడి ఉన్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో వాటికి మోక్షం లభిస్తుందని ఆ సామాజిక వర్గీయులు ఆశతో ఎదురుచూస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో ఒక్కొక్క భవనానికి రూ.50 లక్షలు మంజూరు చేసి కోడూరులో శంకుస్థాపన శిలాఫలకం ఏర్పాటు చేయగా, ప్రస్తుతం ఆ ప్రాంతంలో శిలాఫలకం విరిగిపడిపోయింది. దీంతో నాడు కాపు సామాజిక వర్గీయులు తమకు ఒక కల్యాణ మండపం ఏర్పడుతుందని సంతోషపడ్డారు. వారి ఆనందాన్ని వైసీపీ ప్రభుత్వం ప్రారంభంలోనే నీరుగార్చింది. గత ప్రభుత్వంలో ఆ పార్టీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆ ప్రస్తావనే తీసుకురాలేదు. తిరిగి మండలి బుద్ధప్రసాద్ ఎమ్మెల్యేగా గెలుపొందటంతో ఆ నిర్మాణాలు ప్రారంభించి, పూర్తి చేస్తారని ప్రజలు భావిస్తున్నారు. ఈ భవనాల నిర్మాణం పూర్తయితే కాపు సామాజిక వర్గీయులు శుభకార్యాలు, సమావేశాలు నిర్వహించుకోవటానికి ఉపయోగపడతాయని బుద్ధపసాద్ చెప్పారు.

రావెళ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో చీరల పంపిణీ



చల్లపల్లి : చల్లపల్లి మండలం మంగళాపురానికి చెందిన రావెళ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో 100 మంది నిరుపేదలకు చీరల పంపిణీ చేశారు. స్థానిక కోమలానగర్ ఎదురుగా నివసించే నిరుపేద మహిళలు, లక్ష్మీపురం ఎస్టీ కాలనీలోని మహిళలకు ఫౌండేషన్ ఛైర్మన్ రావెళ్ల ఉదయ్‌కుమార్, అధ్యక్షుడు నిడమానూరి దిలీప్‌కుమార్, కార్యదర్శి రావెళ్ల విజయ్‌కుమార్ చీరలు పంపిణీ చేశారు.